
# నాకు నచ్చిన నా కథ



ద్విభాష్యం రాజేశ్వరరావు

ఏ రచయితా గొప్ప రచయితగా పుట్టడు. గొప్ప రచయితగా పరిణతి చెందుతాడు. మహా రచయితల రచనల్లో కూడా అన్నీ గొప్పవేనని చెప్పటం కష్టమని నా ఉద్దేశ్యం. అన్నీ మంచి కథలే రాసిన రచయితలు లేదా రచయిత్రులు బహు కొద్దిమంది వుంటారని నా నమ్మకం.

అన్నీ మంచి కథలే రాయలేక పోయినా, తాను రాసింది మంచి కథో కాదో లీలామాత్రంగానయినా ఆ రచయిత మనోనేత్రానికి గోచరిస్తుంది. గోచరించి తీరుతుంది. తాను రాసిన ప్రతి కథా తనకు ప్రియమయినదే కావొచ్చు. కన్నతల్లికి బిడ్డలందరూ ప్రియమయినవాళ్ళే. కాని యోగ్యులు, అయోగ్యులు ఆ బిడ్డల్లో వుంటారు కదా. అలాగే తన బాధలోంచి బయటకు తన్నుకువచ్చిన కథ ఏదో – పత్రికలవారి పోరు పడలేకనో, పాఠకులు తనని మరచిపోతారనే భయం చేతనో, ప్రచురితమయితే అంతే చాలనే ఉద్దేశ్యంచేతనో రచయిత చేసే వివిధ ప్రయత్నాలలో బయటకు వచ్చిన కథ ఏదో – తప్పకుండా ప్రతి రచయితకూ తెలుస్తుంది. ఆ విషయం అంగీకరించటం, అంగీకరించకపోవటం, ఆయా రచయితల సంస్కారంమీద ఆధారపడి ఉంటుందని నా నమ్మకం. ఈ కథ 'వాన

కురిసిన రాత్రి' మంచి కథో, చెడ్డ కథో నాకు తెలీదు, కాకపోతే ఇది మాత్రం నాకు నచ్చిన నా కథ। ఇరవై సంవత్సరాల క్రితం జీవితంలో అడుగుపెడుతున్న తొలిరోజుల్లో మనసును చీల్చుకుని బయటకువచ్చిన కథ।। ఓ ప్రముఖ మాస పత్రికలో ప్రచురితమయింది ఇది।

# వాన కురిసిన రాత్రి

నేను ముత్యపు చిప్పను కాను।

నాకు ఆనందం కలిగించటానికి స్వాతి చినుకులే అక్కరలేదు। వాన చినుకులు ఎప్పుడు నింగినుండి రాలినా నా కిష్టమే। నల్లని మబ్బులనుండి పూసల దండల్లా చినుకులు పడుతూ ఉంటే చూడటానికి నాకు ఎంతో ఆహ్లాదంగా వుంటుంది. మట్టిమీద చినుకులు పడిన తరువాత గాలి మోసుకొచ్చే వింత పరిమళమంటే నాకు ఎంతో ఇష్టం. చీకటి సుందరి పెదవిమీద చిరునవ్వులా వెలిగి మాయమయ్యే మెరుపులు చూడటంలో నాకు అమితమైన ఆనందం। తృప్తి లభ్యమవుతుంది।

వాన కురుస్తున్నప్పుడు గదిలో కూర్చుని వెచ్చగా సిగరెట్లు పీలుస్తూ, కథలు వ్రాయటం నాకు ఒక హాబీలాంటిది.

కాని రెండు సంవత్సరాలక్రితం జరిగిన ఆ సంఘటన నన్ను పూర్తిగా మార్చివేసింది. ఇపుడు వర్షం కురుస్తూ ఉంటే ఆనాటి దృశ్యమే నా కనుల ముందు ప్రత్యక్షమౌతుంది। నా పాపాన్ని, కుటిలత్వాన్ని, స్వార్థాన్ని ఎత్తిచూపి ఎగతాళిచేస్తూ ఉంటుంది, ఈనాటికీ ఆ సంఘటన.। ఇపుడు వర్షం కురుస్తూవుంటే ఆ హోరు ఎవరో బాధగా మూల్గుతున్నట్లు, రాక్షసి ప్రసవవేదనను అనుభవిస్తున్నట్లు అనిపిస్తుంది। కొన్ని కోట్ల గొంతులు వెక్కివెక్కి ఏడుస్తూవుంటే, ఆ కన్నీరే వర్షం కురుస్తున్నట్లు బాధపడతాను।।

• • •

రెండు సంవత్సరాల క్రితం — ఆ రాత్రి।....

కాటుకలా నల్లని మబ్బులు నింగిని ఆక్రమించుకొన్న రాత్రి — చెట్లను నేలగూల్చేలా ప్రచండ వేగంతో గాలి వీచిన రాత్రి — ఏనుగు తొండంలాటి ధారలతో వర్షం కురిసిన రాత్రి — ఆ రాత్రి — నాకు బాగా జ్ఞాపకం।।।

గది తలుపులు బిగించి, కుర్చీలో కూర్చుని, కాళ్ళు టేబిలుమీద పెట్టి, సిగరెట్లు అగ్గిపుల్లల్ని వేస్టుచేయకుండా కాలుస్తూ: రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి

"మంచి చెడ్డల్లో ఏ కథ?" చదవటం పూర్తిచేసి ఆలోచనలో పడ్డాను. ఆ కథలో రెండు భాగాలున్నాయి మొదటిది— 'మంచి'. రెండోది 'చెడ్డ.' ఆ రెండూ గొప్ప కథలే. ప్రతి మనిషిలోనూ ఆలోచనను రేపుతాయి. అయితే "ఈ రెండిటిలో మీకు ఏది ఇష్టమో చెప్తే మీ స్వభావం కొంతవరకు వెల్లడౌతుందని నా అభిప్రాయం" - అంటూ చివరన ఒక పరీక్ష పెట్టారు రచయిత ఎంతసేపు యోచించినా వాటిలో దేనిని నేను ఎక్కువ ఇష్టపడ్డానో తేల్చుకోలేకపోయాను. కాని ఇపుడు అనిపిస్తోంది "వాటిలో నాకు రెండోభాగమే ఎక్కువగా నచ్చిందని."

ఆ ఆత్మపరీక్షన సమయంలో - తలుపులు దబదబ బాదిన చప్పుడు అయింది. లేచి వెళ్ళి తలుపు తీశాను. వర్షపుజల్లు ఒక్కసారి మొహాన కొట్టింది. ఆయాసపడుతూ తడిసి ముద్దయిన ఆకారం, జగన్నాధం గదిలోకి వచ్చాడు.

జగన్నాధం నా తోటి గుమాస్తా. ఒక్కసారి మీరు వాడిని చూస్తే "వీడు గుమాస్తా వెధవ." అని పోల్చుకుంటారు. ఈ దేశంలో గుమాస్తాలు పడే బాధలన్నీ వాడి ముఖంలో గూడుకట్టుకొని ఉంటాయి. జగన్నాథం చూడటానికి చాలా బాధగా కనిపిస్తాడు. వాడి ముఖంలో మంచితనం కొట్టొచ్చినట్లు కనబడకపోయినా జగన్నాథం అతి మంచివాడు. వాడి మంచితనం, నిజాయితీ - ఈ రెండూ కలిసి వాణ్ణి దారిద్ర్యావస్థకు తీసుకువెళ్ళాయి.

"ఇంత వర్షంలో ఇలా వచ్చావేమిటి?" అన్నాను.

"రాజా. యాభై రూపాయలు అర్జంటుగా కావాలి. నువ్వు సర్దగలవనే ఆశతో వచ్చాను. ఈ సాయం చేస్తే నీ మేలు జన్మలో మరచిపోలేను." ఉద్వేగంతో అన్నాడు.

నాకు కొంత ఆశ్చర్యం కలిగిన మాట వాస్తవం.

ఇంత రాత్రివేళ యాభయి రూపాయలు అవసరం వీడికేమిటి వచ్చింది? అనుకున్నా. నా వద్ద నిజానికి డబ్బు వుంది. మరుసటిదినం టెర్లిన్ చొక్కా కుట్టిద్దామని అనుకుంటున్నా. ఇప్పుడు ఈ డబ్బు ఇచ్చేస్తే మరల అది తిరిగిరావటం కష్టం.

టెర్లిన్ చొక్కా కుట్టించుకోవాలనే నా కోరిక కూడా ఇప్పట్లో మరి తీరదు.. మనసు జగన్నాథానికి సాయం చేయటానికి ఒప్పుకోలేదు.

"నా వద్ద అయిదు రూపాయలు వున్నాయి. నేను నీలాగ గుమాస్తా వెధవనేగా. అంత డబ్బు ఎక్కడ వుంటుంది?" అని నిలువునా అబద్ధం ఆడేసి ఒక నవ్వు ముఖానికి పులుముకున్నాను.

జగన్నాథం ముఖంలో నిరాశ స్పష్టంగా తొంగి చూసింది.

"నీ దగ్గర ఉంటుందనే ఆశతో వచ్చాను, మరోచోట ప్రయత్నిస్తాలే."

అంటూ తలుపు తీసుకుని తొందరగా అడుగులు వేసుకుంటూ వర్షంలోకి నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి అంతా వర్షం కురుస్తూనే వుంది. వర్షం కురిసిన రాత్రి తెల్లవారింది!

వర్షపు వేగం తగ్గినా చినుకులు మాత్రం పడుతూనే వున్నాయి.

ఉదయం తొమ్మిది గంటలకు హోటల్‌లో భోజనం ముగించి ఆఫీసువైపు నడక సాగించాను. రోడ్డు బురదగా వుంది. మళ్ళా పెద్దదవబోయే వర్షాన్ని సూచిస్తూ నింగిలో మబ్బులు ముసురుకుంటున్నాయి.

ఆఫీసుకు వెళ్ళే దారిలోనే జగన్నాథం ఇల్లు! అరుగుమీద స్తంభానికి జారగిలబడి కూర్చొని పిచ్చిగా శూన్యంలోకి చూస్తున్నాడు వాడు! నెల దినాలనుండి తిండిలేనివాడిలా అతి నీరసంగా ఉన్నాడు. వరండాలో అడుగు పెడుతూ అడిగాను.

“ఏం జగన్నాథం! అలా కూర్చున్నావ్?”

నన్ను చూడగానే జగన్నాథం కంటిలో నీళ్ళు చిప్పిల్లాయి! కూర్చోక ఏం చేయను? నేను అసమర్థుణ్ణి! దరిద్రుణ్ణి. ఎందుకూ పనికిరానివాడిని!!! నాలాంటివాడిని భగవంతుడు ఎందుకు పుట్టిస్తాడో తెలీదు! లోకంలోని నిర్భాగ్యపు గుమాస్తాలందరు కలిసి దేవుడిమీద తిరగబడితే ఎంత బాగుంటుంది!!!

మూడు దినాలనుండి నా భార్యకు జ్వరం! నిన్న సాయంత్రం పరిస్థితి మరీ విషమించింది. డాక్టర్ విశాఖపట్టణం పెద్ద ఆసుపత్రికి తీసుకువెళ్ళిపోమన్నాడు. నా దగ్గర చిల్లిగవ్వ కూడా లేదు. ఎవరిదగ్గిరా నయాపైస కూడా అప్పు పుట్టలేదు. ఇంక అప్పు చేయనక్కరలేదులే! దాన్ని వైజాగు తీసుకెళ్ళనక్కరలేదు! పిడికెడు బుగ్గిచేస్తే చాలు! నా భార్య - నా దారిద్ర్యానికి, అసమర్థతకు బలి అయిన భార్య- లోపల మంచంమీద అతి ప్రశాంతంగా నిద్రపోతోంది చూడు!”

మాటలు ఆపి బిగ్గరగా విచిత్రంగా నవ్వుతున్నాడు జగన్నాథం.

అలా నవ్వుతూ వుంటే వాడిలోనుండి ఏదో భయంకరమైన భూతం వచ్చి నా జుట్టు పట్టుకొని పీకుతున్నట్లు అనిపించింది. నా గుండెల్లో దడ, కాళ్ళలో వణుకు ఆరంభం అయ్యాయి.

నిన్న రాత్రి జగన్నాథానికి డబ్బు ఇచ్చివుంటే....? మరి ఆలోచించలేక పోయాను.

జేబులోని నోట్లు గొంగళిపురుగుల్లా మారి ఒంటిమీద పాకుతున్నట్లు అనిపించింది!

“ఈ డబ్బు వుంచు! తరువాత పనులకి పనికివస్తాయి.” అంటూ జేబులోని పురుగుల్లాంటి నోట్లను తీసి వాడిమీదకి విదిల్చాను.

బయట వర్షంతోపాటు నా మనసులో బాధాగ్ని హెచ్చవుతోంది!!

నాలోని కుటిలత్వాన్ని, స్వార్థాన్ని, ఈ వర్షపునీరు కడగలేదు!!!

వర్షపుహోరు ఎవరో ఏడుస్తున్నట్లుంది!....